క్లుప్తంగా...

మంత్రి కేటీఆర్‌కు స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆర్యన్‌గుప్తా

అబిడ్స్: మంత్రి కేటీఆర్‌కు నగర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ మమతా గుప్తా, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా తనయుడు ఆర్యన్‌గుప్తా స్వాగతం పలికారు. శనివారం నగరంలోని నిజాం హాస్టల్‌కు వచ్చిన కేటీఆర్‌కు ఆర్యన్‌గుప్తా స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా విదేశాల్లో న్యాయశాస్త్రం చదువుతున్న ఆర్యన్‌గుప్తాతో కొంతసేపు కేటీఆర్ విదేశీ విద్యా విధానంపై ముచ్చటించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్‌లో పలు లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాదీముబారక్ పథకం నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లలకు కల్పతరువు లాంటిదన్నారు. దరఖాస్తుతో పాటు అన్ని రకాల ధ్రువపత్రాలు జతచేస్తే కానీ చెక్కులు మంజూరు కావాని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూన్‌ఫరాన్ తదితరులున్నారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది'



కార్యక్రమానికి తరలివెళ్తున్న బీజేపీ నాయకుడు అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ ఆరోపించారు. శనివారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్‌లు అంటూ నాటకాలు ఆడుతున్నారన్నారు. ఆయనవెంట డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్ తదితరులున్నారు.


సమాజ సేవలోనే ఆనందం



కంప్యూటర్‌ను అందజేస్తున్న మహేష్ బ్యాంక్ డైరెక్టర్ వీరేందర్ ఖండేల్‌వాల్

అబిడ్స్: సమాజ సేవలోనే ఎంతో ఆనందం, తృప్తి ఉంటుందని మహేష్ బ్యాంక్ డైరెక్టర్ వీరేందర్ ఖండేల్‌వాల్ పేర్కొన్నారు. అబిడ్స్ చిరాగల్లీలోని జీపీఎస్ కుచే స్కూల్‌కు ఒక కంప్యూటర్‌ను ఉచితంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.అర్పితకు ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం సేవలందించేందుకు ముందుంటానని ఆయన అన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అర్పిత మాట్లాడుతూ.. విద్యార్థులకు చేయూతనందించేందుకు వీరేందర్ ఖండేల్‌వాల్ లాంటి నాయకులు ముందుకురావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా అన్నిరంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాను అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరులు

చార్మినార్: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలన్న ప్రధాని మోదీ పిలుపు మేరకు శనివారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ 'మేరీ మాటీ మేరా దేశ్'ప్రచారంలో భాగంగా మన అమర అమరవీరుల స్మారకార్థం దేశ వ్యాప్తంగా అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నారన్నారు. గతేడాది నరేంద్ర మోదీ హర్ ఘర్ తిరంగా అభియాన్ కోసం దేశం మొత్తం ఏకతాటిపైకి వచ్చిందన్నారు. అలాగే ఈసారి కూడా మనం ప్రతి ఇంటిలో త్రివర్ణ పతకాన్ని ఎగరవేయాలని, ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్ రెడ్డికి జాతీయ జెండాను అందించారు.

సంగీత కళలపై మక్కువ పెంచాలి



పురస్కార గ్రహీతలతో వేణుగోపాలచారి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి చిన్నారులకు భారతీయ సంగీత కళా నృత్యాలపై మక్కువ పెంచాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. శనివారం బొగ్గుల కుంటలోని తెలంగాణ పరిషత్‌లో శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ప్రైడ్ ఇండియా ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉపల శ్రీనివాస్‌గుప్తా, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, కేరళ జ్యోతిష్యులు శివనర్సింహాన్ స్వామి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జి.కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



వేడుకల్లో మాజీ డీజీపీ అరుణ బహుగుణ, స్పెషల్ ఆఫీసర్ సత్యానందం తదితరులు

అబిడ్స్: విద్యార్థులు వారి అభిరుచులకు అనుగుణంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ డీజీపీ అరుణ బహుగుణ అన్నారు. అబిడ్స్‌లోని సెయింట్ జార్జెస్ గర్ల్స్ గ్రామర్ స్కూల్ జరిగిన 189వ ఇన్వెస్టిచర్ సెర్మని వేడుకల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బాలికలు సైతం ధైర్యవంతంగా, చురుకుదనంగా ఉండి ప్రతిభావంతులుగా కావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. క్లాస్ లీడర్లకు అరుణ బహుగుణ బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ మర్లేనె ఈస్టర్, స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, రేవ్ బ్రదర్ పి.సోలమాన్‌రాజ్, వార్డెన్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విమల్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీహెచ్ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఈద్గా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గోషామహల్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గోషామహల్ రోడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గోషామహల్ రోడ్, రవి పెట్రోల్ పంప్, సంతోష్ దాబా, దూద్‌ఖానా, అహిర్ ప్లాజా, ఏసీపీ కార్యాలయం, ఇజిలి మాతా, పాత ఫీల్‌ఖానా, చేపల మార్కెట్, స్వాస్తిక్, లేబర్‌అడ్డా, పోస్ట్ ఆఫీస్, మట్టికా షేర్, వందేమాతరం స్కూల్ లైన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అలాగే 11 కేవీ ప్రభాత్, గణేష్ ఆలయం విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఎంసీహెచ్ క్వార్టర్స్, సంఘం హోటల్ లైన్, ఏకే భవన్, అరాస్ పేట, నింబోలి అడ్డా, మోతి మార్కెట్, మర్వాడి కాలేజ్ లైన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ మేరా దేశ్'

గోల్కొండ: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కార్వాన్ శిశుమందిర్‌లో 'మేరీ మాటీ మేరా దేశ్'కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసుధన్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ల అశోక్‌తో పాటు బీజేపీకి చెందిన వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

కుల్సుంపురాలో స్వచ్ఛ్‌భారత్



కుల్సుంపురా పోలీస్ క్వార్టర్స్‌లో రోడ్డుపైన ముళ్ల కంపను తొలగిస్తున్న దృశ్యం

జియాగూడ: గోల్కొండ జిల్లా స్వచ్ఛ్‌భారత్ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు గోల్కొండ జిల్లా స్వచ్ఛ్‌భారత్ సెల్ కో కన్వీనర్ పైలం సందీప్ సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంజి రఘునాథ్, సోషల్ సర్వీస్ సభ్యుడు ఆధలా కార్తీక్ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడ కుల్సుంపురా పోలీస్ కాలనీలో రోడ్డు ఇరువైపులా ఉన్న తుమ్మచెట్లు, ముళ్ల కంపను తొలగించారు. కాలనీవాసుల అభ్యర్థన మేరకు నిర్వహించినట్లు తెలిపారు.


కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో చైర్మన్ సాయిప్రసాద్, కార్యదర్శి బీఎస్.మధుసుదన్

అబిడ్స్: కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ సాయిప్రసాద్, కార్యదర్శి బీఎస్.మధుసుదన్ పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. అబిడ్స్‌లోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున బ్యాంకు ఉద్యోగులు, అధికారులు విజయవాడలో జరుగుతున్న మూడు రోజుల కాన్ఫరెన్స్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల ప్రగతి కోసం ఎంప్లాయీస్ యూనియన్ అండగా ఉండి ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంజీరా సొసైటీ సెక్రెటరీ కోటిరెడ్డి, సెంట్రల్ కమిటీ మెంబర్ మంజులా, వినయ్‌కుమార్, గౌరిగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న వి.ప్రకాష్‌రావు తదితరులు

మణికొండ: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వాటర్ రిసోర్స్ చైర్మన్ వి.ప్రకాష్‌రావు సూచించారు. వనితమోహన్ ఆధ్వర్యంలో శనివారం మణికొండలోని ముష్కి చెరువు వద్ద పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 170 మంది వాలంటీర్లు పాల్గొని చెత్తచెదారాలు, వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లుతదితరవాటిని మొత్తం 356కిలోల వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధృవాన్ష్ ఆర్గనైజేషన్ సభ్యులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సిటీ కళాశాలలో అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో 2023–24 సంవత్సరానికి ఆంగ్ల విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ తెలిపారు. ఆంగ్ల విభాగంలో ఉన్న రెండు పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఈనెల 14వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు సిటీ కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

తిరంగా ర్యాలీని దేశభక్తితో నిర్వహించుకోవాలి



ఇన్‌స్పెక్టర్ ముత్తును సన్మానిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను పటిష్టంగా అమలు చేస్తామని ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ముత్తు అన్నారు. ఈ మేరకు శనివారం బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ముత్తును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ముత్తు మాట్లాడుతూ.. సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఎలాంటి నేరాలు జరగకుండా నిఘా ముమ్మరం చేశామని తెలిపారు. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజు జరిగే తిరంగా ర్యాలీని దేశ భక్తితో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేనా నాయకులు మనోజ్, అభినయ్ తివారి, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంగ్రెస్ నాయకుడి మృతి



చంద్రకాంత్ (ఫైల్)

గోల్కొండ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రకాంత్ మృతి చెందారు. శుక్రవారం రాత్రి తన ఇంట్లో మెట్లపై ఆయన జారిపడ్డారు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆయన మృతి చెందారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం పురానాపూల్ హిందూ శ్మశానవాటికలో జరిగాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్ యాదవ్ చంద్రకాంత్ మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంజన్‌కుమార్ వెంట కాంగ్రెస్ నాయకులు రవీందర్, పురకుల కృష్ణ తదితరులున్నారు.

నగదు బ్యాగుతో పరార్..

5 గంటల్లో పట్టుకున్న పోలీసులు

అఫ్జల్‌గంజ్: పట్టు చీరలు కొనుగోలు కోసం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం వెళ్లడానికి నగరానికి వచ్చిన ఓ వ్యాపారి నుంచి రూ 2,25,000 ఉన్న బ్యాగుతో పరారైన ఓ వ్యక్తిని అఫ్జల్‌గంజ్ పోలీసులు 5 గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సంతోషం తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన సింగిరికొండ వంశీకృష్ణ అలంకార్ రోడ్డులో మమత సిల్క్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో పట్టు చీరలు కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం వెళ్లేందుకు శనివారం ఉదయం 5 గంటలకు మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ ఉన్న మూత్రశాల గోడపై బ్యాగును పెట్టి టాయిలెట్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే బ్యాగు కనిపించలేదు. కంగారుపడిన వంశీకృష్ణ అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా నిందితుడి కోసం గాలించగా అతడు అత్తాపూర్‌కు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకొని సోదాలు నిర్వహించగా ఓ చోట నిందితుడు వెంకటేష్ అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని లాల్‌దర్వాజా జగదీష్ మందిర్ ప్రాంగణంలో శనివారం ఆమె రూ.5.30 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు స్థానంలో జీహెచ్ఎంసీ ద్వారా మంజూరైన రూ.5.30 లక్షల నిధులతో నూతనంగా సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుమన్‌కుమార్ ముదిరాజ్, నాయకులు అర్జున్ ఆర్య, జమాల్‌పూర్ అశోక్, స్వప్న, బలరాం, విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి



ఎమ్మెల్యేను కలిసిన గోల్కొండ తహసీల్దార్ అహల్య

గోల్కొండ: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆసీఫ్‌నగర్, గోల్కొండ మండల తహసీల్దార్లుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొత్త తహసీల్దార్లు నానల్‌నగర్ డివిజన్ మిరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఆసీఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, గోల్కొండ తహసీల్దార్ అహల్య ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన రాష్ట్ర సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా ఎ.దుర్గారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం నూతన కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షురాలిగా దుర్గారాణి, ఉపాధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రేణుకా, కోశాధికారిగా స్వప్న, జాయింట్ సెక్రెటరీగా నాగరాణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నవనీత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉషారాణి ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షురాలు దుర్గారాణి మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణ మహిళా హక్కుల కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలి

జియాగూడ: ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం జీహెచ్ఎంసీ ద్వారా రెసిడెన్షి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. నూతన ఓటర్లకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి రశీదును అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు, సి.బాబు, కోశాధికారి ఎం.మహేష్‌బాబు, సంఘం సభ్యులు ఎం.సురేందర్, సి.నర్సింగ్‌రావు, ఎం.సుదర్శన్, వై.జస్వంత్‌కుమార్, వి.అరుణ్, జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు కార్యక్రమంలో ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ

మహా ధర్నాకు తరలిన బీజేపీ నేతలు



మహాధర్నాకు తరలిన కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: పేదలకు డబుల్ బెడ్‌రూంలు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడనాడాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహా ధర్నాకు శనివారం జాంబాగ్ డివిజన్ నుంచి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జాంబాగ్ డివిజన్‌లోని ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శైలేందర్ యాదవ్, అనిల్ యాదవ్, ప్రవీణ్‌బాబు, రఘు, సంతోష్, రామకృష్ణ, రేణుకా, కల్పన, అజయ్, జగపతి తదితరులు పాల్గొన్నారు.

నెమలికంటి తారక రామారావుకు పురస్కారం



స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న కేవీ రమణాచారి

నాంపల్లి: ప్రముఖ రంగస్థల సినీనటుడు రావు గోపాలరావు వర్ధంతిని పురస్కరించుకుని శనివారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో రావు గోపాలరావు నాటకోత్సవాలు జరిగాయి. ఈ నాటకోత్సవాల్లో భాగంగా మంజునాథ్ రచించిన సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి 'థింక్'నాటిక, కీర్తిశేషులు అప్పలాచార్య రచించిన మల్లాది భాస్కర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న మల్లాది క్రియేషన్స్ వారి 'తులసి తీర్థం'నాటికలను ప్రదర్శించారు. అలాగే మాస్టర్ అభిరామ్ భావరాజు–బేబి సరయు భావరాజులచే ఇంద్రజాల ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను అలరింపజేసింది. ఈ సందర్భంగా కిన్నెర–రావు గోపాలరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు నెమలికంటి తారకరామారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగస్థల నటులు సుబ్బరాయ శర్మ, ప్రముఖ ఇంద్రజాలకుడు ప్రొఫెసర్ బి.వి.పట్టాభిరామ్, కళా పోషకులు లయన్ వి.వి.రాఘవరెడ్డి, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరిస్తున్న భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్

గౌలిపురా: డ్రగ్స్ వినియోగానికి నేటి యువత దూరంగా ఉండాలని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ సూచించారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్గా హోటల్ ప్రధాన రహదారిలో శనివారం డ్రగ్స్‌పై స్థానిక యువతకు ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల బారిన పడి విలువైన తమ జీవితాలను నాశనం చేసుకోకూడదన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తూ కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్సైలు నరేందర్‌రెడ్డి, అంకిరెడ్డి, లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసానికి వినతి



అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను, పెండింగ్‌లో ఉన్న పనులపై గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్, జి.నందుకుమార్, కిరణ్, కిశోర్, నవీన్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని సానుకూలంగా స్పందించారు. వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు.